కౌముది

అది ఒక వీథి. వీథి అనటంకన్న రాచబాట అనటం సమంజసం. గతుకులులేకుండా, పెద్దరాళ్ళు పదునుపట్టి వేశారు. బాటకిరువైపులా గుబురుగా చెట్లూ, వాటి ననుసరించి పూల తీగెలు. వెనక్కి తిరిగి చూశాను. అంతా అపరిచితంగా వుంది. అస్తమయసూర్యుని రక్తారుణకాంతిలో ఒక్క అరమైలు దూరంలో ఎత్తయిన కోటగోడలూ, దేవాలయ శిఖరాలూ ధగధగమెరుస్తున్నై. ఎంత జ్ఞాపకం చేసుకున్నా నేనెక్కడ వున్నానో తెలీటం లేదు. నాపక్కనే వెనకాలా, ముందూ, పురుషులూ, స్త్రీలూ కాలినడకనా, గుర్రాలమీదా, పల్లకీలమీద వెడుతున్నారు. నాకు గొప్ప కలలాగు తోస్తోంది ఇదంతా. ఆ ప్రదేశమంతా శుభ్రమైన సువాసనలతో గుబాళిస్తోంది. కాస్త పరిశీలనగా ఆ వెళ్ళే ప్రయాణికుల్ని చూడసాగాను. పంచెలు కట్టుకుని, గిరజాలు గంభీరంగా దువ్వుకుని, పురుషులు పై పంచెలు వల్లెవాటుగా వేసుకుని తమ గమ్యం వేపుకి చకచక సాగిపోతున్నారు. కొందరు పొడుగాటి కత్తులవొరలు నడుముకు వేళ్లాడుతూవుంటే రాచగర్వంతో, తలపాగా వాళ్ళహోదాల్ని నిర్ణయిస్తుండగా నిదానంగా, నిర్లక్ష్యంగా నడుస్తున్నారు. పల్లకీల్లో, మేలిముసుగుల చాటున నూతన యౌవనోద్భవం పురిగొల్పే చిరునవ్వు తొణికిసలాడే యువతులు నన్నాకర్షించారు. సౌందర్యం ఇక్కడ పోగులుపడి వుందా అనిపిస్తోంది. ఆభరణాలకి వన్నె తెచ్చే వాళ్ళవొయ్యారమైన శరీరమూ, ఎన్నిసార్లు చూసినా, తనివితీరని శరీరచ్ఛాయా, నాకు విభ్రమం కల్పించాయి.

కాలినడకన పోతూ, ఏ అపవిత్రపు ఆలోచననీ ఎరగని పసిపిల్లలవంటి యువతుల వొయ్యారపునడక, ఎప్పటివో ప్రాచీనాభరణాలంకారంలో, అజంతా శిల్పాలూ, రాయవెల్లూరు సౌందర్యప్రతిమలు ప్రాణంపోసుకున్నాయా, అనిపించే విన్నాణం ఒలికే దేహనిర్మాణంతో, పూజాద్రవ్యాల, పుష్పాల సుగంధపరిమళాలు మిళితమైన పిల్లగాలికి జుట్టు ఉంగరాలు మొహాన పడుతున్నా గమనం తగ్గించనివాళ్ళ విన్యాసం నా చారిత్రక జ్ఞానాన్ని జ్ఞప్తికి తెస్తున్నాయి.

నేనెక్కడవున్నానో నా కర్థమవలేదు. ఒకసారి నావంక నేనే చూసుకున్నాను. రిస్టువాచీ, సిగరెట్‌పెట్టి, సిల్కు లాల్చీ నున్నగా దువ్విన క్రాపు, ఇంగ్లీషుట్విల్ పైజమా, ఈ వాతావరణంతో నాకున్న సంబంధం ఆశ్చర్యంగ వుంది.

''నుల్చున్నారేం ఆర్యా'' అనే గంభీర సంబోధన విని పక్కకు చూశాను. నా పక్కనే, ఇరవై ఏళ్ళ ఆజానుబాహువైన యువకుడు మొలలో వేళ్లాడే కత్తిని సవరిస్తోనన్నీ ప్రశ్నవేశాడు. అతనిదుస్తులు వొంటికి అతుక్కుపోయినట్టు అమరివున్నై. గొప్ప వీరత్వమూ సాహసమూ అతని విశాలమైన వక్షస్థలంలో, వైఖరిలో ద్యోతకమౌతున్నై.

''ఆశ్చర్యంగా చూస్తున్నారు! మీదేగ్రామం?'' అని మళ్ళీ ప్రశ్నించాడు. అతని ప్రశ్నలో

అనురాగమూ, అతిథిసత్కారపూర్వకమైన మర్యాదా గోచరిస్తున్నై. రెండు నిమిషాలు అతణ్ణి తేరిపారచూసి ''మాది గురజాల'' అన్నాను. అతని ముఖంలో విచిత్రమైనమార్పు గోచరించింది.

''గురజాల'' అనేసి అతను ఏదో జ్ఞాపకం తెచ్చుకునే ప్రయత్నంలో ఆకాశంవంక చూసి, ''గురజాల సీమలో మీలాగా ఎవ్వరూ దుస్తులు వేసికోరే!'' అన్నాడు; మా యిద్దరి మధ్యా ఆవరిస్తున్న సంజచీకట్లతోపాటు అప్పుడే తూర్పున ఉదయించిన పూర్ణచంద్రబింబపు చల్లని వెన్నెల మాకు కాలగమనాన్ని సూచిస్తున్నై.

నేనందుకున్నాను: ''మావైపునేకాదు, ఆంధ్రప్రదేశమంతటా ఇలాగే' అని నేను మాట పూర్తిచెయ్యక ముందే అతడు పకపక నవ్వేడు. నవ్వాపుకుని, నా భుజంమీద నెమ్మదిగా తడ్తూ, తూర్పున కనిపిస్తున్న కోటగోడల్ని చూపిస్తూ, అతను ''శాతవాహన ప్రభువు పరిపాలనలో ఎక్కడా ఈ రాజ్యం మొత్తంలో ఈ వేషధారణ బొత్తిగా అసంభవం'' అన్నాడు.

నేను అదిరిపడ్డాను కాలగతిలో ఏదో విపరీతం సంభవించింది. ఇరవయ్యో శతాబ్దం మనిషిని, ఎలాగో శాతవాహనశకంలో పడ్డాను. ఈ అపూర్వస్థితిలో, అతనూ నేనూ, సమన్వయపడడం చాలా కష్టం. కాని, ఎలాగో అడ్జస్టు కావాలి; అనుకుంటూ, ''కావచ్చునుకోండి. వేషంతో ఏమేమిటి? - అది సరే ఈ వూరి పేరేదో చెప్పగలరా?'' అని అడిగాను ప్రార్థనాపూర్వకంగానూ, స్నేహభావంతోనూ.

ఆ క్షత్రియ అపరిచితుడు, చిరునవ్వు నవ్వి, '' ఇదే విజయపురం. దీనిని విజయాదిత్యభూపాలుడు పరిపాలిస్తున్నాడు. అది సరేగాని ఆర్యా! తమ నామధేయమేదో సెలవిస్తారా?'' అని ప్రశ్నించాడు.

ఒకగండం తప్పిపోయినందుకు సంతోషిస్తూ ''వేంకటామాత్యుడు'' అన్నాను. ఈ శకంలో పేర్లు ఇలాగే వుంటాయి అని వినివున్నాను. ''తమ పేరూ?'' అని ప్రశ్నించాను.

''ఓహో! సరే. నా పేరు ఉదయసింహుడు. మేమూ క్షత్రియులమే. రాజప్రాసాదంలో సైన్యాధికారిగా వుంటున్నాను. ఇవ్వేళ కార్తీకపౌర్ణమి గదా! అందుకని మన్మథ పూజకి వెళ్తున్నాను'' అని ముగించాడు, చలి ప్రారంభించటంవల్ల వల్లెవాటుని బిగించుకుంటూ.

నేను, చుట్టూ వెళ్తున్న ప్రజల గమ్యస్థానం వేపుగా నడక సాగిస్తూ, '' ఇవ్వాళ ఉత్సవం కాబోలు'' అని అడిగాను, తెలిసినట్టే ప్రశ్నించి, తెలియని వాటిని తెలుసుకోటం నాగరీకుల లక్షణం.

ఉదయసింహుడు నాతోటే నడుస్తూ, బాటకి కుడివేపుగా ఓ ఫర్లాంగు దూరంలో ఉదయచంద్రుని లేవెన్నెల కాంతిలో మెరుస్తూన్న ఓ పాలరాతి దేవాలయాన్ని నాకు చూపించాడు. దేవాలయమూ, దానిచుట్టూ డేరాలూ; అక్కడక్కడ కాగడా వెలుగులో, ప్రజాసమూహం క్రిక్కిరిసి వుంది; దేవాలయపు దక్షిణప్రాంగణంలో పడమరనుంచి తూర్పుకి ప్రవహిస్తోంది ఓ పెద్ద నది.

ఉదయసింహుడు మళ్ళీ చెప్పసాగాడు. ''సంవత్సరానికి ఒక్కసారి - ఒక్క రోజైన, ఈ రోజెంత మనోజ్ఞమైంది! చూడండి. ఆ వెల్లే యువతులను! ఎంత ఉల్లాసం! ఏమండీ! మీరు బ్రహ్మచారులేనా?'' అని ప్రశ్నించాడు అకస్మాత్తుగా.

''అవును'' అన్నా దేనికి అన్నట్టు అతనివేపు దృష్టి సారించి.

''దేనికని అంటారా? ఇవ్వాళ దంపతులు, బ్రహ్మచారులను యధోచితంగా సత్కరిస్తారు. పదండి త్వరగా. మన్మధుని దర్శించి, మనమూ ఉత్సవములో పాల్గొందాము'' అన్నాడు గమనాన్ని త్వరితంచేసి.

''అవునండీ. ఆ వేడుకల్లో పాల్గొనాలని నాకు చాలా కుతూహలంగా వున్నది'' అంటూ అతన్ననుసరించాను. జరగబొయ్యే దేదైనా, దాన్ని కొద్దిగానైనా ఊహించుకోగలను గనక ధైర్యంగానే వున్నాను.

2

నక్షత్రాలతో, చంద్రకాంతితో ఆకాశం రత్నకంబళం లాగా వుంది. దేవాలయప్రాంగణంలో అడుగు పెట్టేటప్పటికి చంద్రకాంతి బాగా తెలుపు తిరిగింది. చలిగాలి వీస్తోంది, అనేక విచిత్ర పరిమళాల్ని మోసుకొస్తో దేవాలయపు లోప్రాంగణమంతా, ప్రజా సమూహంతో క్రిక్కిరిసి వుంది. అక్కడే నిలబడి అన్నీ మరిచిపోయి సింహద్వారం మీదే నాచూపు నిలిచిపోయింది. ఇద్దరు తరుణవయస్కులైన కన్యలు అర్ధనగ్నంగా, సింహద్వారానికి రెండువేపులా నిలబడి వచ్చేవార్ని ఆహ్వానించే భంగిమలో, శిలవరాతితో చెక్కబడి వున్నారు. సన్నని నడుమూ, కోలమొగమూ, చిరునవ్వులొలికే పెదాలూ - నన్ను సమ్మోహితుణ్ణి చేస్తున్నాయి.

నా క్షత్రియ మిత్రుడు గంభీరంగా, ''లోపలికి రండి'' అని పిలిచేవరకూ నాకు స్పృహే లేదనాలి. దేవాలయంలో అడుగు పెట్టాను. ఎంత శుచిగా, ఎంత అందంగా వుంది! వందలకొలది ప్రమిదల్లో సువాసనతైలాలుపోసి వెలిగించారు. ఆ పూజ్యమైన కాంతిలో, - మన్మధ దర్శనానికి వొచ్చిన యువతీ యువకుల కోలాహలంలో - మంగళ వాయిద్యాల రాగమూర్ఛనల్లో, కర్పూరం, రకరకాల పువ్వుల పరిమళాల్లో ఆ రతీమన్మధసన్నిధి ఎంత గొప్పగా వుందీ!

ఒకసారి దేవాలయాన్నంతా కలయచూచాను. గోడల నిండా యువతీ యువకుల విగ్రహాలు, అనేక భంగిమల్లో, అపూర్వంగా చెక్కబడి వున్నాయి. లతలు, వాహనాలు, పద్మాలూ అన్నీ శిల్పసౌందర్యం వుట్టిపడుతున్నాయి. కళ్యాణ మండపం దాటి, మౌనంగా, ఆ సౌందర్య పరిమళ వాతావరణంలో లీనమై గర్భగుడిముందున్న దర్శనమంటపంలో ప్రవేశించాను.

ఒక యువతీ యువకుడూ రతీమన్మధుల కెదురుగా, ఐదారు గజాల దూరంలో సంభోగభంగిమలో నగ్నంగ నిలబడివున్నారు! కళ్ళు నులుముకుని మళ్ళీ చూసాను. ఆశ్చర్యం! రెండూ శిలలు; సహజ వర్ణాలివ్వబడ్డ రాతి విగ్రహాలు; వాటి చుట్టూ, వాటికన్న అందమైన అమ్మాయిలు స్నానంచేసి, ఆరి ఆరని జుట్లు వొయ్యారంగా ముడేసుకుని, విలువైన చీరెలు ధరించి, సమస్తాభరణాలతోటి అలంకరించుకుని, మన్మధుణ్ణి, పూజించేందుకు వరసగా నిలబడి వున్నారు. మరోవేపున యువకులు నిలబడి కామదేవతలని పూజిస్తున్నారు. నన్నొకరిద్దరు విలక్షణంగా చూసినా ఎవరూ అంతగా నన్ను గమనించలేదు. నేను పక్కకు తిరిగి, నా మిత్రుడి చెయ్యి పట్టుకుని ఉల్లాసంగా వూపుతూ, ''బైటికి వెడదామా?'' అని అడిగాను.

''పదండి పోదాం'' అని అతనూ నన్ననుసరించాడు, దేవాలయ ప్రాంగణం దాటినతర్వాత అతడు నాకు దూరంగా కాగడాల వెలుగులో కన్పిస్తున్న ఒక యువకుల గుంపును చూపించి ''అదిగో ... ఆ

బ్రాహ్మణ బ్రహ్మచారులున్నారే... అక్కడికెళ్ళి వుండండి. ఎవరేనా దంపతులు పిలువగలరు. నేను అటు వెళ్తాను. మళ్ళీ ఉదయం, కృష్ణరేవులో కలుసుకుంటా మిమ్మల్ని'' అని, నాదగ్గిర మర్యాదా పురస్సరంగా శలవు తీసుకుని, అక్కడ తిరుగుతున్న తిరునాళ్ళ ప్రజలలో కలిసిపొయ్యాడు.

నేను అతడు నిష్క్రమించినవేపే చూస్తూ, దేవాలయం బైట రాతిపై కూర్చుని, సిగరెట్ వెలిగించాను. వేళ్లు కొంకర్లుపొయ్యే చలి; ఏవేవో కలల్ని కలిగిస్తున్న వెన్నెల; ఉన్నతంగా గంభీరంగా నా వెనుక నిలబడివున్న దేవాలయం; ఇవన్ని నాలో నిద్రిస్తున్న కోర్కెల్ని రగిల్చినాయి.

ఈ సుందర యువతులలో ఒక్కతె నా మీద కనికరిస్తే ఈ రాత్రి ఎంత అందంగా, ఆనందంగా గడుచును; కాని - దేవాలయంలో గంటలు గణగణ మోగినాయి. మంగళ వాయిద్యాలు ఉచ్ఛస్థాయి నందుకున్నాయి. ఆ విశాలమైన ప్రదేశంలో తీరుగాడుతున్న వారందరిలోనూ, ఏదో విచిత్ర పరివర్తన వొచ్చింది. హడావుడి హెచ్చింది. అందరూ ఏవో కేకలేసుకుంటూ మంత్రాలు వల్లిస్తూ, ఇంకా వేగంగా, దేవాలయంలోకి వస్తున్నారు. ఈ తడవ విడివిడిగా రావటం లేదు. జంటలు జంటలుగా, యువతీ యువకులు ఖరీదైన పట్టువస్త్రాలు కట్టుకుని దేవాలయంలోకి వెళ్తున్నారు. నేనీ పరిస్థితిని అర్థంచేసుకోకముందే, నావేపొక వృద్ధపురోహితుడు రావటాన్ని అకస్మాత్తుగా గమనించాను. దేనికి? అనే ప్రశ్న వేసుకుంటూండగానే అతడు నన్ను సమీపించాడు.

గౌరవసూచకంగా లేచి నిలబడి, అతనికి నమస్కరించాను. ఆయన రుద్రాక్షమాల, విభూతి ధరించి, శుచిగావున్నాడు. నా నమస్కారం అందుకుని ఆయన ''దీర్ఘాయుష్మాన్‌భవ'' అని నన్ను ఆశీర్వదించి ''తమనామ ధేయం?'' అని ప్రశ్నించాడు.

''వేంకటామాత్యుడు, గురజాల కాపురస్తుణ్ణి'' అన్నాను.

''ఓహో!.... సరే సరే. తాముగూడా అతిధిసత్కారార్థమే వేచివున్నారా?'' అన్నాడయన.

''అవునండి'' అన్నాను.

''ఒక సంపన్నులైన గృహస్థు మిమ్మ ఆహ్వానిస్తున్నారు. దయచెయ్యండి'' అంటూ నడవసాగాడు. ఆయన్ననుసరించాను మౌనంగా. చుట్టూ ఏవేవో పూలూ, ఇతర వస్తువులూ అమ్మే దుకాణాలముందు, కాగడాల వెలుగులో నిల్చున్న జనాన్ని దాటి, కృష్ణసమీపంగా ఇసకలో ఒక నడికారు వ్యక్తి, ఆయనభార్యకాబోలు నిల్చుని పురోహితుని రాకకు ఎదురుచూస్తున్నారు. అక్కడికివెళ్ళాం. పురోహితుడు ముందుగా నన్ను వాళ్ళకి పరిచయం చేశాడు. ఆ నిల్చున్న సుందరి నన్నొకసారి ఓరకంటితో చూసి, చిరునవ్వు నవ్వింది. ఇందాక దేవాలయంలో చూసిన శిల్పకన్యలు జ్ఞాపకం వొచ్చారు.

గృహస్తు గంభీరంగా అందుకున్నాడు: '' ఈ పర్వదినాన గ్రామాంతరంనుండి వొచ్చిన ఒక అతిథి మాకు లభించటం ఎంతో పుణ్యం'' అని పురోహితుని వేపు తిరిగి ''అయ్యా, వీరిద్దర్ని కృష్ణదగ్గరికి తీసుకువెళ్ళి కార్యక్రమాన్ని పూర్తి చేయించండీ'' అన్నాడు. నాకిదంతా గందరగోళంగావున్నా, పురోహితుని వెంట నడిచాను. అసలు - ఆమె వెనకాలే నడుస్తూ ఆమె అంగసౌష్ఠవాన్ని అనుభవించటం నా ఉద్దేశం.

3

కృష్ణరేవును సమీపించగానే పౌరోహితులవారు ఆమెనీ, నన్నూ స్నానంచెయ్యమని ఆజ్ఞాపించారు. చలివొణికిస్తోంది. నేనింకో పరిస్థితిలో ఐతే చచ్చినా స్నానం చేయకపోదును; పురోహితుడి ఆజ్ఞకన్న, నా అపరిచితసుందరి, ''సంశయిస్తారేమండీ? వేళమించిపోవటం లేదూ?'' అంటూ మృదువుగా అన్నమాటకోసం సిల్కులాల్చీ, పైజామా విప్పి వాళ్ళిచ్చిన కొల్లాయివస్త్రం కట్టుకుని, ఆమె చెయ్యి ఊతంగా తీసుకుని నీళ్ళల్లోకి దిగాను, రేవంతా మంత్రఘోషతో నిండిపోతోంది. వెన్నెల కృష్ణతరంగాలమీద ఆడుకుంటోంది. నా అపరిచితసుందరి ఒక సుగంధచూర్ణంతో నా వొళ్లు రుద్దుతోంది నేను చలికి వొణుకుతోవుంటే పకపక నవ్వుతూ, ''చలికి భయపడతారా మీ గురజాలసీమవారు!'' అన్నది.

'క... క... క... కాదు ... లే. పొద్దుపోతోందిగాని...' అంటూ ఆమెకి చక్కిలిగింతలు పెట్టాను.

ఆమె సమ్మోహనకరంగా నవ్వుతూ నీళ్ళల్లోకి మునిగిలేచింది. ఆమె వొంటిమీద నీటిబొట్లల్లో వేలాది చంద్రబింబాలు మెరుస్తున్నాయి. తలకి తుండుగుడ్డ బిగించి వొడ్డెక్కుతూ, ''రండి...'' అంటూ నన్ను పైకి లాగింది. నేను పురోహితుడిచ్చిన పట్టుపంచె కట్టుకుని, అతని ఆజ్ఞప్రకారం ఆమె కుడిచెయ్యి పట్టుకుని నుంచున్నాను. ఆకలేస్తోంది. ఏమిటీ తతంగం! అని లోలోపల అనుకుంటున్నాను నేను.

పురోహితుడు ఏవో మంత్రాలు వల్లించి, ఆమెచేత నాకు బొట్టు పెట్టించాడు. ఆమె నా నుదుట కుంకుమపెట్టింది. నా వొళ్ళు జల్లుమంది. ఆమె అనంతసౌందర్యానికి చుట్టూవున్న ఎత్తయిన కొండరాళ్ళు కూడా వొణుకుతున్నాయా అనిపించింది. ఆ కార్తీకమాసపు భామికలు కొరికే చలి, వెన్నెలసొగసు, వివిధ పరిమళాలు మోసుకొచ్చేగాలి, నన్ను ఏవేవొ తియ్యటికలల్లోకి తీసుకెళ్తున్నాయి.

నా అపరిచితసుందరి, తడిచీర విప్పేసి నిగనిగలాడే రక్తవర్ణపు పట్టుచీరె ధరించింది. లేత ఎరుపురంగు మస్లిన్ రవికె తొడిగింది. ఆమెవేపు చూశాను. ఉన్నతమైన వక్షస్థలం అస్పష్టంగా కన్పించుతోంది. కోలమొగంమీద చిరునవ్వులో కొంటెతనం, నమ్రత కన్పిస్తున్నాయి.

''రండి, మన్మథదర్శనంచేసుకుని వద్దాం'' అన్నది ఆమె.

''సరే పద'' అన్నాను.

ఆమె వొయ్యారపు నడకమీదే వుంది నా మనసంతా. బిగించి కట్టిన చీరెగుండా కన్పించే శరీరపు వొంపులమీద ఊగులాడే తాచుపాములాంటి జడ, మధురమైన ధ్వని కలిగిస్తూన్న కాళ్ళ అందెలూ, పాపిటగుండా తీర్చిన స్వర్ణాభరణం వెన్నెట్లో - నన్నొక పిచ్చివాణ్ణి చేస్తున్నాయి.

దేవాలయం ఇందాకటికన్న ఇప్పుడెక్కువ జనసంకీర్ణంగా కోలాహలంగా వున్నది. కల్యాణమంటపంలో వేశ్యలు నృత్యం చేస్తున్నారు. ఎవరో జావళీ పాడుతున్నారు చాలా భావయుక్తంగా. దాన్ని విననట్టే మేమిద్దరం ముందుకుసాగాం. ప్రమిదలకాంతిలో చందనం, కర్పూరం, సాంబ్రాణి పరిమళాల్లో మగత ఆవరించిననేను, నా అపరిచిత శ్రీమతితోపాటే, మంత్రోక్తమైనపూజలో పాల్గొని కామదేవతకి నమస్కరించాను.

''సాష్టాంగనమస్కారం చెయ్యండి'' అంది ఆమెనవ్వుతూ.

'' ఆహా....'' అంటూ మన్మధుడికి సాష్టాంగపడ్డాను.

'' ఇక లేవండి. పొద్దుపోతోంది'' అంది ఆమె.

4

విశాలమైన ఆ మైదానప్రాంతంలో కాగడాల వెలుగులో వేసివున్న ఒక డేరాలోకి ప్రవేశించాం ఇద్దరం. పక్కనే కృష్ణప్రవహిస్తోంది మందకొడిగా. ప్రజల కోలాహలంతగ్గి దేవాలయంనుంచి శ్రావ్యమైన సంగీతం వినిపిస్తోంది.

'' ఇదంతా ఏమిటి సుందరీ!'' అని అడిగాను డేరాపరికిస్తూ.

''మన్మథపూజ చేస్తున్నామండీ!'' అంది. ఆమె; నిద్రతో, బరువుగా తేలిపొయ్యే కోర్కెలతో మూసుకుపొయ్యే కొంటెచూపు చూసి.

నా చుట్టూ ఆకాశ నీలవర్ణపు మొఖమల్ తెరలు, ఓ పక్క పెద్దమంచం. మంచంపక్కనే ఎత్తయినబల్లమీద ఓ పాత్రనిండా ఎర్రని ఏదో పానీయమూ, ఓ వెండిగ్లాసులో పాలూ, పళ్లెంలో రకరకాల పండ్లు - పలహారాలూ నోరూరిస్తున్నాయి. పక్కమీద రోజా రేకులు వెదజల్లారు. ప్రకాశమానంగా వెలుగుతున్న దీపంనుంచి మగత గొల్పే సువాసనలువొస్తున్నాయి.

''కూచోండి, ఆర్యా! ఆనందపూర్ణమైన, పూజ్యమైన రాత్రి గడవకముందే...'' అంటూ ఆమె నన్ను అతి గారాబంగా మంచంమీద కూచోబెట్టింది. ఇదంతా విచిత్రమైన స్వప్నంలాగా వుంది నాకు.

''ఆకలేస్తోంధి'' అన్నాను ఆమెని గోముచేస్తూ.

''ఇవిగో... తినండి... తినిపించనా?'' అంటూ ఆమె నాకతి సమీపంలో కూర్చుని నానోట్లోకి పలహారాలు అందిస్తోంది. ఆమెని నావొళ్ళోకి లాక్కుంటూ ''నువ్వుతినూ!'' అని ఓముక్క నేను కొరికి మిగతా ముక్క ఆమెనోటికందించాను.

''ఎబ్బే... ఆడవాళ్ళు ఎంగిలి తింటారా.'' అంది ఆమె విరగబడి నవ్వుతూ. ఆమె పాలబుగ్గలు ఎర్రబారినాయి. రేగే కామతృష్ణ ఆమెకనుకొలుకుల్లో రక్తార్ణవ రేఖలుగా వ్యక్తమౌతోంది.

''ఈ పానీయమేమిటి సుందరీ? ఇంతకమ్మని వాసన వేస్తోంది! అమృతమా?'' అని అడుగుతూ ఓ గుక్క త్రాగి, ఆమె కిచ్చాను మిగతాది.

''సుర!'' అంటూ ఆమె గూడా రెండుగుక్కలు చప్పరించి, గ్లాసు నాకందిస్తూ '' ఎంత బావుందండి ఈ రాత్రి!'' అంది రొమ్ముల్ని వెనక్కి విరుచుకుంటూ.

నేనామెపక్కనే ఆమెమీదికి వొరుగుతూ, బిగుతైన ఆమె రవికముడి విప్పుతూ, '' ఎన్ని సుఖస్వప్నాల ఫలితమో ఈ సుందరి!'' అన్నాను. డేరా అందుల్లోగుండా, మజ్లీన్ తెరల అవతల వెన్నెల పాకుతోంది.

''మీరూ!... ఏమండి ... మీ పేరేమిటండి?'' అని నన్ను బుజ్జగిస్తో, నా పొట్టి క్రాపు సవరిస్తోంది ఆమె.

''నా పేరు వేంకటామాత్యుడు. సుందరీ! ఇలాగే ఈ రాత్రులు శాశ్వతమైతే'' అంటూ ఆమెని పూర్తిగా ఆక్రమించుకుంటూ, ''నీ పేరు చెప్పావుగాదు'' అని అడిగాను.

తమలపాకులతో ఎర్రనైన చిన్న పెదిమలలోగుండా, జాజికాయ, పచ్చకర్పూరం, సుర, పరిమళాలతో కలిసినవ్వుతూ నా మొహాన్ని తనదగ్గరగా లాక్కుంటూ ఆమె ''కౌముది'' అంది.

''కౌముదీ!'' అన్నాను పెద్దగా. ఆమెకీ నాకూ గూడా సుర మైకంగొల్పుతోంది. కౌముది, ''ఏమండి, మీరు వివాహం చేసుకుంటేనన్ను జ్ఞాపకం వుంచుకుంటారా!'' అని ప్రశ్నించింది. ఆమెకేమీ జవాబివ్వకుండానే ఎర్రటి తియ్యటి పెదాల్నినా పెదాలతో మూస్తూ, ''దీపంతగ్గించనా?'' అని అడిగాను.

''వెలుగులో భయమేస్తుందా?'' అని పకపక నవ్వింది.

''భయంకాదు సుందరీ! ఇంత సౌందర్యాన్నీ నేనే అనుభవిస్తున్నానా? అనే భ్రమని భరించలేనని'' అన్నాను.

''దీపం వువండనివ్వండి. ఈ అనన్యసుఖాన్ని సంపూర్ణమైన జ్ఞానంతోటే అనుభవించుదాం. ఏమండి! పాడనా?'' అని అడిగింది.

''పాడతావా? నీ పాటవిని కృష్ణపొంగుతుంది! మన్మధుడు ఆలయంనించి లేచివస్తాడేమో ఇక్కడికి'' అన్నాను. ఆమె మెల్లగా లేచి అర్ధనగ్నంగానే ఓమూలవున్న వీణ తీసుకుని తీగెలుమీటి పాడసాగింది. నామనస్సూ, చుట్టూ అచేతనంగా వున్న డేరా తెరల కృష్ణ నీలపునీళ్ళూ అన్నీ ఆ గానంలో లీనమైనాయి. బల్లమీద వుంచిన రిస్టువాచీ వంక చూచాను పదకొండుగంటలవుతోంది.

''రా - రా కౌముదీ! గానవాహినిలోనే నన్ను వొడ్డుతెలీని స్థితిలో పడేయకు. రా! -'' అన్నాను మైకంగా.

''వొస్తున్నాను. మిగిలినసురగూడా తాగండి. రాజప్రాసాదంనించి ప్రత్యేకం తెప్పించారు'' అంటూ ఆమె, మంచంమీదకొచ్చి వాలుతూ, దీపం తగ్గించింది.

అబ్బ! ... వొళ్ళంతా నొప్పులు. ఏమిటిది? రాత్రి చూసిందంతా... నిజమేనా? అయోడిన్ వాసనలు... తెల్లని గోడలు... ఎత్తుమడమల బూట్ల టకటకలు... రోగుల దగ్గులు.... ఒక అందమైన దేవత నాలోకి తొంగిచూసింది. దేవత కాదు నర్సు... ... '' ఎలావుందండీ?'' అని అడిగింది. కళ్ళు బరువుగా మూసుకున్నాను.

(కథావాహిని 1955)